నిర్లక్ష్యపు చీకట్లు

- ఆర్టీసీ కాలనీలోని పార్కులో వెలగని విద్యుద్దీపాలు
- పేరుకుపోయిన పచ్చిక
- ఏడాదిగా ఇదే పరిస్థితి
- భయపడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కాకినాడ ఒకటో డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ పార్కులో వెలగని విద్యుత్ లైట్లు

కాకినాడ రూరల్: చిన్నారులకు ఆట విడుపు.. పెద్దలకు వాకింగ్‌తో పాటు ఓపెన్ జిమ్. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, సెలవురోజుల్లో సందడిగా కనిపించే ఆర్టీసీ కాలనీపై పార్కుపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. కాకినాడ నగర పాలక సంస్థ పరిధి ఒకటో డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ వాసుల కోసం పార్కును ఏర్పాటు చేశారు. కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికవ్వడంతో ఆ నిధులతో ఆ పార్కును అభివృద్ధి చేశారు. పార్కులో ఓపెన్ జిమ్, ప్రహరీని ఆనుకుని చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో స్థానికులు, పరిసర ప్రాంతాల వారు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకుంటున్నారు. మహిళలు వ్యాయమానికి అలవాటుపడ్డారు. పిల్లలు ఆటతో సందడి చేస్తుంటారు. సౌకర్యంగా ఉన్న పార్కులో సాయంత్రం అయితే వెళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు. విద్యుద్దీపాలు లేకపోవడంతో అందకారంతో ఇబ్బంది పడుతున్నారు.

చిమ్మ చీకట్లతో..

పచ్చని వాతావరణం, ఆహ్లాదరమైన గాలి, నీడనిచ్చే చెట్లు సముదాయం నడుమ అందంగా కనిపించే పార్కులో సాయంత్రం వేళ భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ విద్యుద్దీపాలు వెలగకపోవడంతో సాయంత్రం 6 గంటలకే పార్కులో చిమ్మ చీకట్లతో అంధకారం అలుముకుంటున్నాయి. దాదాపు ఏడాది నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ సిటీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పార్కు అక్కరకురాకుండపోయిందని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. పార్కులో పచ్చిక ఎక్కువగా పెరగడంతో పాముల భయం పట్టుకుంది.



ఆర్టీసీ కాలనీ పార్కులో పెరిగిన పచ్చిక, పని చేయని ఊయల

పరికరాలు పనిచేయక..

పార్కులోని ఓపెన్ జిమ్‌లో కొన్ని వ్యాయామం చేసే పరికరాలు పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేసేవారే కరువయ్యారు. దీంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునే జారుడు బల్ల, ఊయల పనిచేయడం లేదు. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయవల్సి ఉంది. పక్కనే ఉన్న పద్మానగర్ పార్కులో సాయంత్రం విద్యుత్ దీపాలు వెలుతున్నాయని, ఆర్టీసీ కాలనీని మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై స్మార్ట్ సిటీ అధికారులను అడిగితే ఎలక్ట్రికల్ ఏఈ పర్యవేక్షిస్తున్నారని సమాధానం ఇస్తుండగా ఏడాదిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా..



ఆర్టీసీ కాలనీ పార్కులో విద్యుత్ దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్మార్ట్ సిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కువ మంది పార్కులో సరదాగా గడిపేందుకు వస్తుంటారు. పార్కులోకి వెళ్లేందుకు భయపడాల్సి వస్తోంది. బల్బులు వెలిగేలా చూడడంతోపాటు పచ్చికను తొలగించే చర్యలు చేపట్టాలి.

– కె.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ కాలనీ, కాకినాడ, ఒకటో డివిజన్

సేవలతో ఎంతో సంతృప్తి



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న రోటరీక్లబ్ కాకినాడ ఎలైట్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజంలో అవసరమైన వారికి సేలందించడంలో ఉన్న సంతృప్తి దేనిలోనూ ఉండదని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో సోమవారం రోటరీక్లబ్ కాకినాడ ఎలైట్ నూతన ప్రతిష్టాపనోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ లగిశెట్టి అనీష్, సెక్రటరీగా భావరాజు కృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాయన సత్యారెడ్డి, కోశాధికారిగా బి.పవన్‌కుమార్‌తో క్లబ్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ తంబాబత్తుల రవి(బ్లూస్టార్ రవి) ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ఉన్నతంగా ఉండాలనే కోరుకునే వాళ్లు రోటరీ వంటి సేవా సంస్థల ద్వారా సేవలు అందిస్తారన్నారన్నారు. తానుకూడా అండగా ఉంటానన్నారు. రోటరీ సేవలు అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాల విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్‌ను క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మందపల్లి శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

నైట్‌షెల్టర్ పరిశీలన



నైట్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీదేవి

కాకినాడ లీగల్: నిరాశ్రయులకు ఆశ్రయ కేంద్రంగా ఉన్న నైట్‌షెల్టర్‌ను కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం పరిశీలించారు. కాకినాడ రామారావుపేటలో ఉన్న నైట్‌షెల్టర్‌లో పడుకునే గదులు పరిశుభ్రంగా ఉన్నాయా?లేదా? నీటి సరఫరా ఉందా? లేదా ? తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

కరప: గురజనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం 'కెరీర్ గైడెన్స్'పై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం ఎం.సాయి మోహన్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు స్వయంఉపాధి కల్పించుకునేలా ఆలోచన చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ్‌పై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్‌లో శిక్షణపొందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు ఆర్ట్స్ అండ్ మూవీస్(సినిమా) అనే అంశంపై మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచులకనుగుణంగా వివిధ వృత్తుల్లో స్థిరపడవచ్చన్నారు. తమకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకొని దానిలో ఉన్నతస్థాయిలో ఎదగాలన్నారు.

లెప్రసీ రోగులకు పాదరక్షలు



విముక్తి కాలనీలో రోగులకు చెప్పులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ విముక్తి కాలనీలోని లెప్రసీ రోగులకు హరిష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఎంసీఆర్ పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రంగనాథ్ మాట్లాడుతూ హరిష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ తలాటం హరిష్ మాట్లాడుతూ 60 మంది రోగులకు రూ.40వేలతో ఎంసీఆర్ పాదరక్షలు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాజమహేంద్రవరంలోని లెప్రసీ కాలనీలోని ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చార్లి, రాజేష్, కోటి, రాజశేఖర్, వీరబాబు, అజయ్, రాజేష్, సురేష్, సత్య, విముక్తి కోలనీ పెద్దలు పాల్గొన్నారు.

తవ్వకాలకు అనుమతివ్వొద్దు

కాకినాడ సిటీ: గొల్లప్రోలు మండలం, కొవలి గ్రామ సర్వే నంబర్ 133/1లో ఉన్న తురకల కొండలో బౌద్ధ ఆరామంలో మైనింగ్ అనుమతులు ఇవ్వొద్దని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బౌద్ధ ఆరామంలో మైనింగ్ అనుమతి చట్ట విరుద్ధమని, ఇప్పటి వరకు ఎటువంటి పర్యావరణ అనుమతులు రాలేదని, అనుమతులు లేకుండా స్థానిక యంత్రాంగం మైనింగ్ పనులు మొదలు పెట్టడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఈ కొండలో మైనింగ్ అనుమతి ఇవ్వద్దని ప్రభుత్వానికి లేఖ రాసిందాన్నరు. కేంద్ర ప్రభుత్వం లేక రాసినా జిల్లా యంత్రాంగంపై స్థానికులు ఒత్తిడి తెచ్చి మైనింగ్ పనులు చేయడం దారుణమన్నారు. ఈ ధర్నాలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు బుగత బంగార్రాజు, కాకర రత్నకుమారి, కె.జనార్దన్, గొడుగు సత్యనారాయణ, కాకర కుమారి, మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే బిల్లులు చెల్లించండి

కాకినాడ సిటీ: పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికులు సోమవారం ధర్నా చేశారు. వేతనాలు పెంచాలని, బాత్‌రూంలో ఫొటో తీసి ఆన్‌లైన్లో అప్లోడ్ చేసే విధానాన్ని రద్దు చేయాలంటూ మధ్యాహ్న భోజన, కంటింజెంట్ కార్మికులు సోమవారం ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్, నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, రమణమ్మ, చామంతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకురాళ్లు డి.సుబ్బలక్ష్మి, పి.వరలక్ష్మి, లోవలక్ష్మి, ఎస్ దేవి, నూకరాజు, రాజేశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం

స్పందనలో ఏడీసీ నాగనరసింహారావు



స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కారిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి వివిధ సమస్యలపై తొమ్మిది మంది వినతులు అందజేశారు. వాటిని సత్వర పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, పింఛన్లకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా వినతులు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఫోన్ ద్వారా వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 19 మంది ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏడీసీ చెప్పారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విధుల బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది రాయసం ఆదిశేషు విటల్‌బాబును కిడ్నాప్ చేసి హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం కాకినాడ బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచూ న్యాయవాదులపై దాడులు, హత్యలు, తప్పుడు కేసులు నమోదు చేయడం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావలసిన అవసరం ఉందని, ప్రకాశం జిల్లా అద్దంకి సివిల్ కోర్టు నుంచి బయటకు వచ్చిన న్యాయవాది విటల్‌బాబును గుర్తు తెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకొని, తీసుకువెళ్లి చంపి, పూడ్చిపెట్టడం చాలా దారుణమని, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం అమలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసులోని దోషులను వెంటనే అరెస్టు చేయాలని న్యాయవాదులు కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

13న కాపునాడు ఐక్యసభ



కాపు ఐక్యసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాపునాడు నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రాజకీయాలకు అతీతంగా ఈనెల 13వ తేదీన కాకినాడలోని కాపు కల్యాణ మండపంలో కాపునాడు ఐక్యసభ నిర్వహించనున్నట్టు ఏపీ రాష్ట్ర కాపునాడు నాయకులు తెలిపారు. ఈ సభలో అందరి అభిప్రాయాలను తీసుకొని ఐక్య కార్యచరణ రూపొందిస్తామన్నారు. స్థానిక హోటల్‌లో సోమవారం కాపు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వాదా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన కాపు నాయకులు ఈ సభకు ఆహ్వానిస్తామన్నారు. వారందరితో చర్చించి ఏకాభిప్రాయంతో హక్కుల సాధనకు భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గాల జనాభా అధికంగా ఉందని దానికి తగ్గట్టుగా రాజకీయ పార్టీలు తమకు టిక్కెట్లు కేటాయించాలన్నారు. కుల అభివృద్ధి కోసం తామంతా ఒకే తాటిపై ఉన్నామంటూ ఈ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈ నెల 13న జరిగే కాపు ఐక్యసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు జానపాముల నాగబాబు, గాదంశెట్టి కొండలరావు, దలే జ్యోతి, జొన్నపల్లి సత్యనారాయణ, సలాది శ్రీనివాస్, ఆకుల రమేష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఏఎంసీ చైర్మన్ పసుపులేటి



మొక్కలు నాటుతున్న ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు

కాకినాడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్‌కమిటీ కార్యాలయంలో సోమవారం కొబ్బరి, పండ్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు పర్యావేక్షణలో ప్రభుత్వాస్పత్రిలో పేదలకు అన్నసమారాధన చేశారు. స్థానిక 37వ డివిజన్‌లో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, యువనాయకుడు మల్లిపాముల గణపతి, మాజీ కార్పొరేటర్లు, ఇనుకొండ పట్టాభి రామయ్య, ఐ.శ్రీను, కొలగాని దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. జిల్లాలో అత్యధిక ఓటర్లను కలిగిన కాకినాడ రూరల్‌లో మరో సారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసే దిశగా ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుండగా ఆయనతో నడిచేందుకు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతున్నారు. ఇటీవల సర్పవరం జంక్షన్‌లోని ఆటో యూనియన్‌కు చెందిన ఐదు గ్రామాల కార్మికులు భారీగా ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరగా ఆదివారం సాయంత్రం సూర్యారావుపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు భారీగా చేరారు. అనంతరం మండలంలోని చీడిగ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో సుమారు 200 మంది పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి అత్యధికం గాను, జనసేన నుంచి కొద్ది మంది చేరడంతో వారికి కన్నబాబు కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మాజీ వార్డు సభ్యులు వాసంశెట్టి నాగభూషణం, నురుకుర్తి రాజు, పొన్నమండ వెంకటేశ్వరరావు(చిన్న), పెంకే శ్రీనివాసరావు, ఎస్సీ నాయకుడు, వార్డు సభ్యుడు బడుగు రవిచంద్రమౌళి, అనుచరులు, రైతు మిత్ర నాయకుడు వాసంశెట్టి నాగేంద్ర, అనుచరులు, రజక సంఘ నాయకుడు మురమళ్ల రమణ, చింతపల్లి అర్జున్, గంజా రాధాకృష్ణ, గుబ్బల రామకృష్ణ, తోలెం సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ చీడిగ గ్రామ ప్రజలకు మొదటి నుంచి వైఎస్సార్ సీపీకి అండగా ఉంటున్నారని, కొత్తగా చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలు పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామన్నారు. ఏ అవసరమొచ్చినా తనను కలవాలని కోరారు. ఎన్నికల సమీపిస్తున్నందున కల్లబొల్లి కబుర్లు చెప్పేందుకు వచ్చే ఇతర పార్టీల నాయకులకు తగిన సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నవరత్న సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ఆయనపై, తనపై నమ్మకంతో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్న వారికి ధన్యవాదాలు తెలయజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ మాట్లాడుతూ చీడిగ గ్రామం వైఎస్సార్ సీపీ కంచుకోట అన్నారు. కొత్తగా చేరిన 200 మందిలో 80 శాతం టీడీపీ నుంచి వచ్చిన వారే అన్నారు. వారందరికీ ఎమ్మెల్యే కన్నబాబు సహకారంతో అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, హితకారిణి సంస్థ డైరెక్టరు దూనబోయిన అరుణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, జేఎస్‌వీ కన్వీనరు గీసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

6న భాగవతంపై ప్రసంగం

కాకినాడ కల్చరల్: స్థానిక చల్లా కల్యాణ మండపంలో అస్వాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ భాగవతంపై ప్రసంగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సమితి కార్యదర్శి కారుప్రోలు గౌరీనాయుడు తెలిపారు. ప్రముఖ ఉపన్యాసకులు గొట్టిముక్కల వెంకట సత్య నరసింహశాస్త్రి భాగవతంలోని తృతీయ స్కందంపై ప్రసంగిస్తారని కారుప్రోలు తెలిపారు. సాహిత్య అభిమానులు అందరూ హాజరుకావాలని కోరారు.

హెచ్చరిక బోర్డులు తొలగించాలి

కాకినాడ సిటీ: జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలో దళిత, బలహీన వర్గాల సాగులో ఉన్న సీలింగ్ భూములను బినామీ పేర్లతో భూ కబ్జాదారులకు కట్టబెట్టే ప్రయత్నాలు ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. దళిత బలహీన వర్గాల ప్రజలు గత 20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించాలని, ఆ భూములను పెత్తందారులకు కట్టబెట్టే చర్యలు ఆపాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, మడికి సత్యం, వడ్లమూరి మంగాదేవి, దేశెట్టి సురేష్, యేసురత్నం, చిన్న, బ్రహ్మం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలను చేసి దర్శించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

సామర్లకోట: తాము చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలన్న సంకల్పంతో బై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వీకే రాయపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివ రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్ని పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యానారాయణ, జైభీమ్ యువజన సేవా సంఘ సభ్యులు సీహెచ చంటిబాబు, జమేశ్వరరావు, అరవింద్, నవీన్, మధుబాబు పాల్గొన్నారు.

పిల్లల్ని పాఠశాలలో చేర్పించండి



విద్యార్థినికి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంపీడీఓ అప్పారావు, ఎంఈఓ-2 సత్యనారాయణ

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఉన్నత విద్యనందిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. డ్రాపవుట్స్‌పై ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణతో కలిసి వేళంగి, కొరిపల్లి గ్రామాల్లో పర్యటించి, బడి మానేసిన విద్యార్థుల పేర్లను నోట్ చేసుకున్నారు. ఆయా గృహాల వద్దకు వెళ్లి తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చి చైతన్య పరచారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేయడమే కాకుండా ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బ్యాగ్, షూస్, టై ఇస్తున్నారని తెలియజేసి బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించేలా చేశారు. వేళంగి-2 గ్రామ సచివాలయం పరిధిలో 8వ తరగతి చదివి మానేసిన విద్యార్థిని నాగలక్ష్మి తల్లిదండ్రులను చైతన్యపరిచి తిరిగి బడిలో చేర్పించారు. గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటో గ్యారేజ్ యూనియన్ ధర్నా

కాకినాడ సిటీ: ఆటోనగర్‌ను ముంపుబారి నుంచి సంరక్షించి, సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతూ ది కాకినాడ ఆటో గ్యారేజ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సుమారు పదేళ్లుగా కాకినాడ ఆటో గ్యారేజ్ ముంపునకు గురవుతుందని, ఏటా రెండు, మూడు సార్లు ముంపునకు గువుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆటో గ్యారేజ్ ముంపుబారిన పడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి చక్రం, గీసాల సుబ్రహ్మణ్యం, లంకే రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణలో భాగంగా కాకినాడ సీబీఎం సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వినతిపత్రం అందించి ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో జేఏసీ చైర్మన్ బాలకుమార్, వై.శ్రీనివాసరావు, జీవీఎల్ఎస్ఎన్ శ్రీనివాస్, ఎల్.గంగాధరరావు, జి.శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట: వేట్లపాలెం గ్రామ శివారు కందదొడిలోని డ్రైన్ల నిర్మాణానికి సోమవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. రూ.18 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా డ్రైన్లను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గ్రామ పార్టీ నాయకులు పాలచర్ల సాయిబాబు, గోలి బాబ్జి పాల్గొన్నారు.

పాలవెల్లువ కేంద్రాలతో రైతులకు మేలు



చేబ్రోలులో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

పిఠాపురం: పాడి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జెడ్పీ సీఈఓ రమణారెడ్డి అన్నారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని జగనన్న పాలవెల్లువ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కేంద్రాలకు అందించిన సామగ్రి, పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కేంద్రాల ద్వారా 160 లీటర్ల పాలను సేకరిస్తారన్నారు. పాలవెల్లువకు సంబంధించి ఏర్పాటు చేసిన గ్రామస్థాయి కార్యదర్శులు రైతుల వద్దకు వెళ్లి వారి పాడి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శర్మ, ఈఓపీఆర్డీ విద్యాసాగర్‌కుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.